4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 17 ఆగస్టు 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# నిర్భయ రాజ్యం సాధించారా?



బుద్దా మురళి

పశ్చిమ బెంగాల్‌లో ఒక డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరగడంతో ఆందోళనతో ఆ రాష్ట్రం అట్టుడుకుతున్నది. వైద్య విద్యార్థులు ప్రారంభించిన ఆందోళన కాస్త బీజేపీ శ్రేణుల రంగప్రవేశంతో రాజకీయ ఉద్యమంగా మారిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలో పరోక్షంగా బెంగాల్ అత్యాచార ఘటనను ప్రస్తావించారు. దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడుల పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమపై లైంగికదాడులు జరుగుతున్నాయని అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన, ఒలింపిక్స్‌లో సత్తాచాటిన మన క్రీడాకారిణులు ఢిల్లీలో నడిరోడ్డుపైకి వచ్చి నెలల తరబడి ఆందోళన చేసినా చలించని ప్రధాని నరేంద్ర మోదీ.. పశ్చిమబెంగాల్ ఘటనపై స్పందించడం గమనార్హం.

సొంత పార్టీ బీజేపీ ఎంపీ సాగించిన అకృత్యాలను మహిళా క్రీడాకారిణులు బయటపెట్టినప్పుడు ప్రధాని అసలు స్పందించకపోవడం ఏ రకంగా రాజధర్మం అవుతుందో? మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి రోడ్డు మీద ఊరేగించడం దేశ గౌరవాన్ని పెంచడం అవుతుందా? మన దేశమే కాదు, అనేక దేశాలు స్పందించినా ప్రధాని మాత్రం మౌనంగానే ఉన్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలను దేశంలోని చాలామంది 'చైనీయులు' అని అనుకుంటారు. అక్కడివారు సైతం తాము భారతీయులం కాదన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. దేశం నివ్వెరపోయే విధంగా మణిపూర్‌లో అత్యాచారాలు జరిగినా, హింసాకాండలో వందలాది మంది మరణించినా ప్రధాని మౌనంగా ఉండటమంటే.. 'మేం ఈ దేశం వాళ్లం కాదు' అనే అభిప్రాయాన్ని వారిలో మరింత బలంగా నాటుకుపోయేలా చేయడమే. ఇలాంటి సందర్భంలోనే యావత్ దేశం వారికి అండగా ఉందని చెప్పడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యే అవకాశం ఉంది. కానీ, మతం, కులం ఆధారంగా ఓట్ల లెక్కలు చూసుకొని పాలకులు స్పందిస్తున్నారు. నిర్భయ ఘటన గుర్తుందా? 2012 డిసెంబర్ 16న ఢిల్లీలో ఒక బస్సులో వైద్య విద్యార్థినిని ఆరుగురు ఇనుప కడ్డీతో దారుణంగా కొట్టి అత్యాచారం చేశారు. 13 రోజుల చికిత్స తర్వాత ఆమె మరణించారు. ఈ ఘటనను నిరసిస్తూ దేశ ప్రజలంతా స్వచ్ఛందంగా ఉద్యమించారు. తర్వాత ఈ ఉద్యమంలోకి బీజేపీ అనుబంధ సంస్థలు ప్రవేశించాయి. 2012లో జరిగిన ఈ ఉద్యమంతో పాటు అన్నా హజారే జరిపిన అవినీతి వ్యతిరేక ఉద్యమం ఢిల్లీలో కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేశాయి. ఈ ఉద్యమాల కారణంగానే బీజేపీ అధికారంలోకి వచ్చింది. మోదీ ప్రధాని అయ్యారు. కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవడంతో ఢిల్లీ పీఠంపై కేజ్రీవాల్ పాగా వేశారు.

ఢిల్లీ నిర్భయ ఉదంతంపై దేశవ్యాప్తంగా ఉద్యమించి అధికారంలోకి వచ్చిన బీజేపీ అత్యాచారాల నివారణకు ఏమైనా చర్యలు తీసుకుందా? అంటే అలాంటిదేమీ లేదనే సమాధానమే వినిపిస్తుంది. గతంలో కంటే ప్రస్తుతం అత్యాచారాలు మరింతగా పెరిగిపోయాయని స్వయంగా ప్రధాని మోదీ తన ఉపన్యాసంలోనే చెప్పుకొచ్చారు. ప్రధాని చెప్పినట్టుగానే 2012 ఢిల్లీ ఉదంతం తర్వాత అత్యాచారాలు పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు కూడా సూచిస్తున్నాయి. 2021 వార్షిక నివేదికలో 31,677 కేసులు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 86 అత్యాచారాలు జరిగాయి. 2020లో 28,046, 2019లో 32,033 కేసులు నమోదయ్యాయి.




రోజూ జరుగుతున్న వందల అత్యాచార ఘటనల్లో బెంగాల్ ఒకటి. దేశవ్యాప్తంగా ఎన్నో ఘోరాలు జరుగుతున్నా స్పందించని మోదీ దీనిపై స్పందిస్తారు. ఆ రాష్ట్ర గవర్నర్ హుటాహుటిన అత్యాచారం జరిగిన మెడికల్ కాలేజీకి వెళ్తారు. బీజేపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతుంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా వారిలో ఈ స్పందన కనిపిస్తే అభినందించాలి. కానీ, సమస్యపై సానుభూతి కన్నా రాజకీయ ఆయుధం దొరికిందనే ఉత్సాహమే వారిలో కనిపిస్తున్నది. నిర్భయ ఉదంతం ద్వారా దేశంలో బీజేపీకి రాజకీయంగా ఎంతో కలిసొచ్చిందనేది వాస్తవం. ఇప్పుడు కూడా తన రాజకీయ ప్రత్యర్థి అధికారంలో ఉన్న బెంగాల్‌లో జరిగిన ఘటనను బీజేపీ ఆ కోణంలో నుంచే చూస్తున్నది. నిర్భయ ఉదంతంపై జరిగిన ఉద్యమమే బీజేపీ అధికారం చేపట్టడానికి సహకరించింది. కనీసం అందుకు కృతజ్ఞతగానైనా అత్యాచారాల నివారణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించాల్సింది. పదేండ్ల పాలన తర్వాత కూడా అత్యాచారాల గురించి ప్రధాని ఆవేదన చెందుతున్నారంటే మరి ఈ పదేండ్లు ఆయన ఏం చేసినట్టు?

**తన రాజకీయ ప్రత్యర్థి అధికారంలో ఉన్న బెంగాల్‌లో జరిగిన ఘటనను బీజేపీ ఆ కోణంలో నుంచే చూస్తున్నది. నిర్భయ ఉదంతంపై జరిగిన ఉద్యమమే బీజేపీ అధికారం చేపట్టడానికి సహకరించింది. కనీసం అందుకు కృతజ్ఞతగానైనా అత్యాచారాల నివారణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించాల్సింది. పదేండ్ల పాలన తర్వాత కూడా అత్యాచారాల గురించి ప్రధాని ఆవేదన చెందుతున్నారంటే మరి ఈ పదేండ్లు ఆయన ఏం చేసినట్టు?**

ఉమ్మడి రాష్ట్రంలో ఆయేషా మీరాపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను రాజకీయం లబ్ధి కోసం వాడుకున్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం అప్పటి టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆయేషా మీరా తల్లితో తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రచారం చేయించారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ ఆ తల్లి టీడీపీ తరపున ప్రచారం చేశారు.

**తెలంగాణలో ఉప ఎన్నికలకు, ఆయేషా మీరా తల్లికి సంబంధం ఏమిటని చంద్రబాబుపై అప్పటి సీఎం వైఎస్ మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం ఏమిటని అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబును కడిగిపారేశారు. అత్యాచారాల ఘటనలను సైతం రాజకీయ పక్షాలు ఎలా వాడుకుంటాయో చెప్పడానికి ఈ ఉదంతం ఒక మచ్చుతునక.**

రాష్ట్రాల్లో సైతం మహిళలకు సంబంధించిన అంశాలను చాలామంది రాజకీయ నాయకులు ఆయుధాలుగానే చూస్తున్నారు. అసలు మహిళల సమస్యలను తీర్చాలనే చిత్తశుద్ధి వారిలో లేనే లేదు. మహిళా కమిషన్లు ఒక రాజకీయ పార్టీ మరో రాజకీయ పార్టీపై చేసే విమర్శలపై అత్యుత్సాహం చూపించడానికి బదులు మహిళల కోసం ఏమైనా సూచనలు చేయగలమా? అనే కోణంలో ఆలోచించాలి. పార్టీ కోసం ఆలోచించేవారు పార్టీల్లో లక్షలాది మంది ఉంటారు. లక్షల్లో వీరూ ఒకరిగా ఉండాల్సిన అవసరంలేదు. మహిళలపై జరిగే అత్యాచారాల నివారణకు ఏమైనా చేయగలమా? అని ఆలోచించాలి.

'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా అయిదా రేడుల పాపల్లారా! మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మీకే అని ఆనందించే కూనల్లారా! మీదే, మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్యవిధాతలు! ఉడుతల్లారా! బుడుతల్లారా! ఇది నా గీతం వింటారా?' అంటూ కల్మషమెరుగని బాల్యానికి అక్షరాల ఆకారం ఇచ్చాడు మహాకవి శ్రీశ్రీ. ప్రతీ మనిషి జీవితంలో రంగుల కలబోత బాల్యమే. మలినం లేని చలనం వారి సొంతం. బుడి బుడి అడుగులు, బోసి నవ్వులు ఎంతటి పాషాణ హృదయులనైనా ఇట్టే కరిగిస్తాయి.



# రెక్కలు తెగిన బాల్యం



డాక్టర్ మహ్మద్ హసన్
99080 59234

ఈ మధ్య వచ్చిన రెండు పాన్ ఇండియా సినిమాలను (యానిమల్, సలార్) కూడా బాల్యం నేపథ్యంలోనే చిత్రీకరించారు. తండ్రిని అమితంగా ఇష్టపడే కుర్రాడిని.. వ్యాపార పనుల్లో పడి ఆ తండ్రి అశ్రద్ధ చేస్తాడు. కాలక్రమంలో తండ్రి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తాడు, బాలుడూ (హీరో) పెద్దవాడవుతాడు. తండ్రి ఎదుగుదలను తట్టుకోలేని వారి బంధువులు అతడిని చంపాలని చూస్తారు. ఈ విషయాలన్నీ హీరోకి తెలుస్తాయి. తండ్రిని కాపాడేందుకు శత్రువులను ఒక్కొక్కరినీ చంపుతూ చివరికి హీరో ఉన్మాదిలా మారతాడు. కుమారుడు తన కోసమే జంతువు (యానిమల్)లా మారాడని ఆ తండ్రి గ్రహిస్తాడు. ఇక మరో సినిమా సలార్ కూడా ఈ కోవకు చెందినదే.

ప్రపంచవ్యాప్తంగా చిన్నపిల్లలపై ప్రస్తుతం జరుగుతున్న కొన్ని దారుణాలు చూద్దాం. 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది. ఫలితంగా ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలైంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ ఆ దేశానికి అండగా ఉంటున్నట్టు అగ్రరాజ్యం అమెరికా కపట నాటకం ప్రదర్శిస్తూ వస్తున్నది. ఒకవైపు శాంతిమంత్రం జపిస్తూనే మరోవైపు యుద్ధాన్ని ప్రోత్సహించడంతో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది మరణించిన విషయం మనకు తెలిసిందే. ఇక ఉక్రెయిన్‌లోని ప్రధాన నగరాలు ధ్వంసమైపోయాయి. లక్షల మంది చిన్నారులు పొరుగు దేశాల్లో వలసపక్షుల్లా జీవించాల్సిన దుస్థితి. ఈ క్రమంలో యుద్ధం చేస్తున్న రెండు దేశాలు, యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్న అమెరికా, యూరోపియన్ దేశాలు చిన్నారుల భవిష్యత్తు గురించి ఆలోచించకపోవటం బాధాకరం. మరోపక్క ఇజ్రాయెల్-గాజా మధ్య జరుగుతున్న యుద్ధం చిలికి చిలికి గాలివానలా మారింది. అక్కడ జరుగుతున్న నరమేధం అంతాఇంతా కాదు. పది నెలల్లోనే 40 వేలమందికి పైగా మరణించారు. వారిలో మూడొంతులకు పైగా చిన్నారులే ఉండటం గమనార్హం. యుద్ధాల వల్ల ఎక్కువగా నష్టపోయేది ఎవరనేది దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఆహారం దొరక్క గాజాలోని పిల్లలు గడ్డి, మన్ను తింటుండటం మానవజాతికే సిగ్గుచేటు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు ఆపకపోవడం, ఐరాస కూడా చేష్టలుడిగి చేతులెత్తేయడంతో గాజా మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

**కక్షతో సాధించలేనిదాన్ని క్షమాభిక్షతో సాధించాలని, కత్తితో ఛేదించలేనిదాన్ని కరుణతో ఛేదించాలని పెద్దలు అంటారు. రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, నైజీరియా, జర్మనీ, లిబియా.. ఇలా ఏ దేశమైనా సరే పిల్లలే ఉంటారు. పిల్లలు లేని ప్రపంచాన్ని ఊహించగలమా?**

పిల్లల రంగురంగుల ప్రపంచాన్ని, స్వేచ్ఛగా ఎగరాల్సిన వారి బాల్యాన్ని మనమే చిదిమేస్తున్నాం. రెక్కలు తెంచేస్తే వారు ఎలా ఎగరగలుగుతారు? యుద్ధాలు, హింసాత్మక ఘటనల ద్వారా బాల్యాన్ని అణచివేస్తే, చిదిమివేస్తే వారి బాల్యం తాలూకు జ్ఞాపకాలు వారిని ఎటువైపు నడిపిస్తాయి? పెరిగి పెద్దయ్యాక వారు ప్రతీకారం కోరుకోరా? ఒకవేళ అదే కనుక జరిగితే ప్రపంచంలో శాంతి, సామరస్యాలు ఎలా వెల్లివిరుస్తాయి? భవిష్యత్తులో శాంతియుత సమాజాన్ని ఎలా ఆశించగలం? నేటి పిల్లలే రేపటి పౌరులు. మనం ప్రస్తుతం తప్పులు చేసి, వారికి బాల్యంలో శాంతియుత సమాజాన్ని అందించకుండా.. భవిష్యత్తులో వారి నుంచి శాంతియుత సమాజాన్ని ఆశించగలమా? ఓ హిట్లర్ సృష్టించిన నరమేధం చరిత్ర గతినే మార్చేసింది. మరో హిట్లర్‌లా ప్రవర్తిస్తున్న ప్రస్తుత పాలకుల ఏలుబడిలో యుద్ధ వాతావరణంలో పెరుగుతున్న పిల్లలు భవిష్యత్తులో మరో హిట్లర్‌లా మారితే ఈ ప్రపంచం మనుగడ సాగిస్తుందా? నిత్యం బాంబు పేలుళ్ల మధ్య గడిపిన బాల్యం హింస వైపు మళ్లదని ఎవరైనా హామీ ఇవ్వగలరా?

ఎవరు ఎటుపోతేనేం మనం సురక్షితంగా ఉన్నామని అనుకోవడం సరికాదు. యుద్ధాల్లో చనిపోయిన, గాయపడిన పిల్లల్ని తల్చుకుంటూ వారి తల్లిదండ్రులు పడే ఆవేదనను అర్థం చేసుకోకపోతే సాటి మనుషులుగా మనం ఎందుకున్నట్టు? ఒంటికి తగిలిన గాయం మానుతుంది కానీ, మనసుకు తగిలిన గాయం అంత త్వరగా మానదు. నేడు మనసు విరిగిన బాలల వల్ల భవిష్యత్తులో మరిన్ని యుద్ధాలు జరిగితే అందుకు బాధ్యత వహించాల్సింది మనమే. మనం వారికి ఎలాంటి భవిష్యత్తును ఇస్తున్నామనేది ఇప్పటికైనా ఆలోచించాలి.

**'చిన్నారులు సామూహికంగా
కలుసుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో
పైన గగనం దిగువ
అలల అలజడిలో కడలి
పిల్లలెప్పుడూ ఆడుతూ, పాడుతూ
నవ్వుతూ, నర్తిస్తూ పోగవుతారు
తీరంలోని ఇసుకతో గూళ్లుకట్టి
ఆటలాడుతారు గవ్వలతో
సాగరంలో ఎండుటాకులనే
పడవలుగా వదిలి నవ్వుతుంటారు
చిన్నారులు ఆడుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో'**

అంటూ రంగుల బాల్యాన్ని వర్ణించాడు విశ్వకవి రవీంద్రుడు. పిల్లల ముఖంలో ఎప్పుడూ ఆనందాన్నే కోరుకుందాం. ఎలాంటి అలజడి లేని సమాజాన్ని వారికి కానుకగా ఇవ్వడానికి మనవంతుగా ప్రయత్నం చేద్దాం. ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ జ్ఞానం స్వేచ్ఛాయుతంగా ఉంటుందో అలాంటి సమాజాన్ని నిర్మించి పిల్లలకు అందిద్దాం.

# రుణమాఫీపై క్షమాపణ చెప్పాలె



డాక్టర్
దూదిమెట్ల బాలరాజు యాదవ్

అబద్ధపు హామీలు, జూటా మాటలతో రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి దగా చేసింది. పంద్రాగస్టు నాటికి రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు 11 లక్షల మంది రైతుల నోట్లో మట్టికొట్టారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ఊరికెళ్తే ఆ ఊర్లోని దేవుడి మీద ఒట్టేసి 'రుణమాఫీ చేస్తా'నని చెప్పిన సీఎం రేవంత్ ఆఖరికి దేవుళ్లను సైతం మోసం చేశారు. ఒకేసారి రుణమాఫీ అని కోట్లు ఖర్చుచేసి పత్రికలకు ప్రకటనలు ఇచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దఫాల్లోనైనా ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో రైతు రుణమాఫీని పూర్తి చేయలేకపోయింది. మూడో దఫాలోనైనా తమ రుణం మాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూసిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. రుణమాఫీ తీసుకున్న రైతుల్లో దాదాపు 35 శాతం మందికి ఇంకా రుణమాఫీ కాకపోవడం శోచనీయం. ఇదిలా ఉంటే రుణమాఫీ ప్రక్రియ మొత్తం పూర్తయిందంటూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిస్సిగ్గుగా ప్రకటించుకోవడం వారి మోసపూరిత విధానానికి, దగాకోరుతనానికి నిదర్శనం.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9 కూడా వచ్చిపోయింది. కానీ, రైతు రుణమాఫీ మాత్రం కాలేదు. పైగా రోజులు గడిచేకొద్దీ ఆ తేదీ మారుతూ వచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న రైతు రుణమాఫీ, 6 గ్యారంటీల హామీలను చూసే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారనే విషయం తెలియనిది కాదు. కానీ, రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ సర్కార్ మాత్రం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నది. డిసెంబర్ 9నే రైతు రుణమాఫీ అవుతుందని ఎదురుచూసిన రైతులు దానికోసం సుమారు 8 నెలలు ఆగాల్సి వచ్చింది. ఆలస్యమైనా ఫర్వాలేదు, రుణమాఫీ అయితే చాలని భావించిన రైతులు ఇప్పుడు నెత్తీనోరు బాదుకుంటున్నారు. రుణమాఫీకి నోచుకోని 11 లక్షల మంది రైతులు తల్లడిల్లుతున్నారు.



అయితే, 'మార్పు' పేరిట ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాయమాటలతో మరోసారి గారడి చేస్తున్నారు. రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులపై అవాకులు, చెవాకులు పేలుతున్నారు. బ్యాంకు రుణం మాఫీ కాని సుమారు 11 లక్షల మంది రైతులు 'రుణమాఫీ'పై ఇక ఆశలు వదులుకోవాల్సిందేనని కాంగ్రెస్ నాయకుల మాయమాటలు చెప్పకనే చెప్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మరో మోసం ఏమంటే.. ఆరు గ్యారంటీల అంశాన్ని పక్కదారి పట్టించడం. అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ పార్టీ 'మహిళలకు ఉచిత బస్సు' పథకాన్ని ప్రారంభించింది. అరకొర వసతుల మధ్య సాగుతున్న ఈ పథకం మహిళలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నది. బస్సుల కొరత, సమయానికి రాని బస్సులే అందుకు కారణం. ప్రయాణికులకు సరిపడా బస్సులను పెంచాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం 'పల్లె వెలుగు' బస్సులకే 'డీలక్స్ బోర్డు'లు పెట్టి రాష్ట్రంలో తిప్పుతున్నది. డీలక్స్ బస్సుల్లో మహిళలకు ఆధార్ కార్డు మీద జీరో టికెట్లు జారీ చేయకపోవడంతో మహిళలు అటు గమ్యాన్ని చేరుకోలేక, ఇటు ఇంటికి చేరుకోలేక రోడ్లపైనే నానా అవస్థలు పడుతున్నారు. అయితే, ఈ 'ఉచిత బస్సు' పథకాన్ని గొప్పగా ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు సుమారు 8 నెలల పాటు కాలాన్ని వెళ్లదీశారు. ఇన్నాళ్లకు కాంగ్రెస్ నేతలకు మరికొంత కాలం పాటు కాలాన్ని వెళ్లదీసే అవకాశం మళ్లీ 'రుణమాఫీ' పథకంతో లభించింది.

అవును మరి, మొదటి దఫా రుణమాఫీ చేయకముందే 'ఒకేసారి రుణమాఫీ చేస్తున్నాం' అని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్న కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు అంతకుమించిన ప్రచారాన్ని చేసుకోదనే గ్యారంటీ ఏమున్నది? అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాని ఒక ముఖ్య విషయాన్ని గుర్తుంచుకోవాలి. అదేమిటంటే.. ఎన్నికలకు ముందు మీ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం మొత్తం 32.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామన్న మీరు 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారు. పూర్తిస్థాయిలో, ఇంకా సుమారు 11 లక్షల మందికి రుణమాఫీ చేయడంలో మీరు విఫలమయ్యారు. అందుకే 'రుణమాఫీ చేయడంలో మా ప్రభుత్వం విఫలమైంద'ని ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పితీరాలి. అంతేకాదు, ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేస్తామని ప్రగల్భాలు పలికిన మీరు అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైంది. అయినా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు. కాబట్టి ఆరు గ్యారంటీల అమలుపై దృష్టిసారించాలి.

అయితే ఇక్కడ ఇంకో విషయం ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఊరూరు తిరిగిన రేవంత్‌రెడ్డి 'మేం అధికారంలోకి వస్తే... డిసెంబర్ 9న రూ.40 వేల కోట్లు రుణమాఫీ చేస్తా'మని చెప్పిన మాట అందరికీ తెలియనిది కాదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఒక దశలో రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నట్టు మాట మార్చారు. ఆపై 2024-25 బడ్జెట్‌లో రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లను మాత్రమే కేటాయించారు. తీరా అసలు సమయానికి రూ.17,869 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఏ విధంగా మోసం చేసుకుంటూ, ఏమార్చుకుంటూ వచ్చారో దీన్నిబట్టి స్పష్టంగా అర్థమవుతున్నది.

**కాంగ్రెస్ నాయకులకు అంతిమంగా చెప్పేదేమంటే.. ఇకనైనా మీ మాటల గారడికి చరమగీతం పాడండి. అభివృద్ధి పథంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణను ఆగం చేయకండి. రాష్ట్ర ప్రగతికి అడ్డుపడకండి. 'లేదు, మేమింతే! తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా మారుస్తా'మంటే మాత్రం ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు.**

(వ్యాసకర్త: తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)

## పౌర, లౌకిక దేశం కావాలె!



గత 75 ఏండ్లుగా మనం మతపరమైన పౌరస్మృతితో జీవిస్తున్నామని, అది వివక్షను ప్రోత్సహిస్తున్నదని, అందువల్ల మన దేశంలో లౌకిక పౌర స్మృతి అవసరమని స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో ప్రధాని మోదీ చెప్పారు. అయితే నేను చెప్పేదేమిటంటే.. పౌర, లౌకిక దేశం కావాలి. గత పదేండ్లుగా బీజేపీ సర్కార్ అటు లౌకిక ప్రభుత్వంగా గాని, ఇటు పౌర ప్రభుత్వంగా గాని వ్యవహరించడం లేదు.

- కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యుడు

# హామీలు గమ్యం అభివృద్ధి గాయం



హామీలు గమ్యం
అభివృద్ధి గాయం
నలిగిపోతున్న తెలంగాణకు
నాయకుడు కావాలి
సంక్షేమ పథకాలు సావు వార్త
మరణించిన సంక్షేమానికి
ప్రాణం పోసే ప్రజా నాయకుడు
కావాలి
నీళ్ల కోసం నిధుల కోసం
నియామకాల కోసం
తెలంగాణ స్వరాష్ట్ర
వనరుల కోసం
భగ్గుమన్న తెలంగాణ భూగోళం
నిధులు నియామకాలు నీళ్లు
అధికారం అంతా డొల్ల
ప్రగతి పడకేసింది
బాధపడుతున్న జనానికి
బతుకునిచ్చే ప్రజాప్రతినిధి కావాలి
రాష్ట్రాన్ని కాపాడే రక్షకుడు కావాలి



దేవరపాగ కృష్ణయ్య
99634 49579